ఉగాది పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మాజీ మంత్రి సబితారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

- నవాబుపేట, మార్చి 30

జలం.. పాతాళం

- అడుగంటిన బోర్లు..
- నీరందక కోత దశలో ఎండిపోతున్న పంటలు
- కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో రైతుల ఆందోళన

కులకచర్ల, మార్చి 30 : యాసంగి సాగులో రైతులను నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో బోర్లు వట్టిపోతున్నాయి. దీంతో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో పొట్ట దశలో ఉన్న పంటలకు నీరు అందక నెర్రెలు బారుతున్నాయి. కొందరు కొత్తగా అప్పులు చేసి బోర్లు వేసినా చుక్కనీరు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎండుతున్న పంటలను చూసి రైతులు తల్లడిల్లుతున్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని చెరువులు, కుంటలు నింపడంతో భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల నుంచి పుష్కలంగా నీరు వచ్చి పంటలు దిగుబడి పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రైతుల కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భజలాలు తగ్గిపోయి రైతుల బోర్ల నుంచి చుక్క నీరు రాకపోవడంతో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయంటున్నారు. ఒక్కో రైతు రెండు, మూడు బోర్లు వేయించినా ఫలితం లేకుండా పోయింది. పదేండ్లలో బోరు నుంచి పుష్కలంగా నీళ్లు వచ్చి పంటలు మంచిగా పండాయి. పదేండ్ల నుంచి మంచిగా నీరుపోసిన బోర్లు ఈ సారి ఎండిపోవడంతో పంటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి రైతులు బోర్లు తవ్వించినా నీరు పడడం లేదు. కులకచర్ల మండల పరిధిలోని గండి చెరువు, చౌడాపూర్ మండల పరిధిలోని గండి మైసమ్మ దగ్గర ఉన్న పొలాలు ఎండిపోతున్నాయని, బోర్ల నుంచి నీరు సరిగా రాకపోవడంతో వరి పొలాలు పూర్తిగా ఎండిపోయే స్థితిలో ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు.

గండి చెరువు గండి మైసమ్మ దగ్గర ఎండిపోయిన వరి పంట

అప్పులు ఎలా తీర్చాలో..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు సమయానికి రైతు బంధు అందించి ఆదుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇప్పటివరకు సరిగా రైతు భరోసా వేయక పోవడంతో పంటలు సాగు చేయడానికి అప్పులు చేయాల్సి వస్తుంది. అప్పులు తీసుకొచ్చి పంటలు సాగు చేసిన పంటలు రైతుల కండ్ల ముందే ఎండిపోతుండటంతో కన్నీటిపర్యంతమవుతున్నారు. పంటలు వేయడానికి తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తోచక బిక్కుబిక్కు మంటున్నారు. కొంత మంది రైతులు తమ పంటలకు నీరు అందక రాత్రింబవళ్లు కష్టపడి నీటిని పారబెడుతూ ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాని నీటి కష్టం నేటి ప్రభుత్వ హయాంలో దాపురించిందని సక్రమంగా ప్రణాళికలు లేక రైతులకు సరైన సలహాలు ఇవ్వకపోవడంతో వేసిన పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి

సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు పంటల సాగు సమయానికి రైతుల ఖాతాల్లో పడేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నది. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు రైతుల కష్టాలు తెలుసు. ఆయన హయాంలో రైతులు ఏనాడు ఇబ్బంది పడలేదు. ప్రస్తుతం రైతులు పలు అవస్థలు పడుతున్నారు. వెంటనే రైతులందరికీ రైతు భరోసా అందించాలి. ఎండిన పంటలను పరిశీలించి పరిహారం అందించేలా కృషి చేయాలి.

- గుండుమల్ల నర్సింహులు, తిర్మలాపూర్, కులకచర్ల మండలం

ఉషస్సుల ఉగాది

- ఇంటింటా షడ్రుచుల వేడుక
- గ్రామాల్లో పంచాంగ శ్రవణం
- పరస్పరం పండుగ శుభాకాంక్షలు

పరిగి : పంచాంగ శ్రవణం చేస్తున్న సిద్ధాంతి పార్థసారథి

పరిగి, మార్చి 30 : తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పరిగి పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా కొత్త కుండలో షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారు చేశారు. సాయంత్రం సమయంలో ఆయా గ్రామాల్లోని ఆలయాల వద్ద వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. పరిగి పట్టణంలోని దాసాంజనేయ స్వామి ఆలయం, బహార్‌పేట్ హనుమాన్ మందిర్‌లలో సిద్ధాంతి పార్థసారథి పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా సంవత్సరం పొడవునా వర్షాలు ఎలా ఉంటాయి, పంటల పరిస్థితితోపాటు ఆయా రాశుల వారీగా సంవత్సరంలో ఎలా ఉంటుందనేది తెలియజెప్పారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాము, గ్రామ పెద్దలు ఎస్పీ బాబయ్య, కొప్పుల రామకృష్ణారెడ్డి, ముకుంద నాగేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాండూరులో..

తాండూరు : తాండూరు నియోజకవర్గంలో ఆదివారం ఉగాది పండుగను ప్రజలు ఉత్సాహంగ జరుపుకున్నారు. తాండూరు పట్టణంతో పాటు తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లోని పల్లెల్లో ఉగాది పండుగ ప్రత్యేకమైన ఆరు రుచులతో కూడిన ఉగాది పచ్చడి, తీపి వంటకాలు చేసి దేవుడికి నైవేద్యం పెట్టిన అనంతరం కుటుంబంతో పాటు బంధుమిత్రులు కలిసి పచ్చడి తాగి తీపి వంటకాలను తిన్నారు. రైతులు తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా పొలాల్లో పూజలు చేసి దుక్కులు దున్నడాన్ని ప్రారంభించారు. ఆలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. ప్రజలకు షడ్రుచుల ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఉగాది సందర్భంగా ప్రజలకు వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతి రోజు ఉచితంగా మంచినీరు అందించేందుకు దాతలు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముదిరాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో పచ్చడి వితరణ చేశారు.

నవాబుపేటలో..

నవాబుపేట : మండల పరిధిలోని గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తెలుగు నూతన సంవత్సర ఉగాది వేడుకలను జరుపుకొన్నారు. పచ్చడి రుచులను చూసి ఈ ఏడాది పండే పంటలు, వివిధ రాశులకు సంబంధించిన ఫలాలను చదివి వినిపించారు.

కులకచర్ల, చౌడాపూర్‌లో..

కులకచర్ల : కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉగాది వేడుకలు ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో పంచాంగశ్రవణంతో పాటు రాశిఫలాలు చదివి వినిపించారు.

దోమలో..

దోమ : మండల పరిధిలోని ఉగాది పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. విశ్వవసూ నామ సంవత్సరం సందర్భంగా పురోహితులు కేతకి లింగంతో పాటు ఆయా గ్రామాల్లో పురోహితులు పంచాంగ శ్రవణం వినిపించారు. అయినాపూర్‌లో భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య ముదిరాజ్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ రాజగోపాల చారి, వెంకటయ్య, సైదుపల్లి భీమయ్య, నల్ల రామ్‌నాథ్, రాజలింగం, చంద్రయ్య, కృష్ణయ్య ఆయా గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం, కోట్‌పల్లిలో..

బంట్వారం/కోట్‌పల్లి : బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో ఉగాది పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం అయా గ్రామాల ఆలయాల్లో పంచాంగాన్ని చదిచి వినిపించారు. బంట్వారం మండలంలోని సల్బత్తాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తాండూరు: ముదిరాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో పచ్చడి వితరణ

నవాబుపేట : పులుమామిడిలో జరిగిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న పంతులు కల్యాణ్ రావు, బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శి ఆసిరెడ్డి గారి వెంకట్‌రెడ్డి

కులకచర్ల : పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పురోహితులు పాండురంగాచారి

దోమ: పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న పురోహితుడు కేతకి లింగం

తాండూరు: బస్ స్టేషన్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న

బంట్వారం/కోట్‌పల్లి : భజన చేస్తున్న భక్తులు

గ్రూప్1లో కులకచర్ల మహిళ ప్రతిభ

మోనికారాణి

కులకచర్ల, మార్చి 30 : సమయస్ఫూర్తి, సమయపాలనతో ఎలాంటి ఉద్యోగానికైనా ఎంపిక కావచ్చని కులకచర్లరే చెందిన తుప్పలి మోనికారాణి నిరూపించింది. గ్రూప్1 ప్రిలిమ్స్‌లో 98 మార్కులు సాధించి మెయిన్స్‌లో 467.5ర్యాంకు సాధించింది. స్టేట్ జీఆర్ఎస్‌లో 263వ ర్యాంకు సాధించింది. ఎస్సీ కేటగిరిలో 16వ ర్యాంకు సాధించింది. దీంతో గ్రూప్1 ఉద్యోగానికి ఎంపికైంది. మోనికారాణి కులకచర్ల గ్రామానికి చెందిన తుప్పలి అశోక్‌కుమార్ భార్య తుప్పలి మోనికారాణి మొదటిసారి గ్రూప్1 అధికారిగా ఎన్నికైంది. 2010లో నిర్వహించిన ఏపీపీఎస్‌సీ గ్రూప్4లో సీఐడీ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించింది. 2012లో వీఆర్వో పోస్టుకు ఎంపికైన ఆమె హైదరాబాద్ జిల్లాలో 10వ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ బోర్డులో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నది.

168వ ర్యాంకు సాధించిన గొల్ల మారుతి

కులకచర్ల మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గొల్ల అంజిలయ్య కుమారుడు గొల్ల మారుతి గ్రూప్-1లో స్టేట్ 168వ ర్యాంకు సాధించాడు. ఇటీవల నిర్వహించిన గ్రూప్1 పరీక్షలో తన ప్రతిభను చూయించి గ్రూప్‌లో స్టేట్ 168వ ర్యాంకు సాధించాడు. తమ కుమారుడు గ్రూప్‌లో స్టేట్ ర్యాంకును సాధించడంపై మారుతి కుటుంబ సభ్యులు సంతోశం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన యువకుడు గ్రూప్1లో ప్రతిభను కనబర్చడం అభినందనీయమని పలువురు అభినందించారు.

ఒగ్గుకళా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రదర్శనలు

ప్రదర్శన ఇస్తున్న ఒగ్గుకళాకారులు

బొంరాస్‌పేట్, మార్చి 30 : మండల పరిధిలోని నాందార్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీమల్లికార్జున ఒగ్గుకళా సేవా సమితి అధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా పలు విన్యాసాలు ప్రదర్శించినట్లు ఒగ్గు బీరప్ప తెలిపారు. ఒగ్గుడోలు ప్రదర్శనకు అవకాశం ఇచ్చిన భాషా సాంస్కృతిక శాఖకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఒగ్గు రవి, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడుకుందాం

సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు. పండుగ వేళల్లో అందరూ మత సామరస్యాన్ని కాపాడేందుకు తోడ్పాటునందించాలని కోరారు. ఆదివారం ఉగాది పూర్తి కాగానే సోమవారం రంజాన్ పండుగ జరుగనున్నది. ఈ నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు.కమిషనరేట్‌లోని పలు ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేసే మైదానాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★Wanted Service Boys & Security Guards to work in Twin Cities. Salary: 15,000/- + ESI & PF. Free Accommodation for Service Boys. Age: up to 35 years. Contact No. 9133377644/45/48.
NT-Mahesh
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రీడాకారులకు టీషర్ట్‌లు అందజేత

క్రీడాకారులకు టీషర్ట్‌లను అందజేస్తున్న గ్రామానికి చెందిన పంతుల శ్రీశైలం, జట్టూరి కృష్ణయ్య

కులకచర్ల, మార్చి 30 : కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో చత్రపతి మహారాజ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు గ్రామానికి చెందిన పంతుల శ్రీశైలం, జట్టూరి కృష్ణయ్య టీషర్ట్‌లు అందజేశారు.ఈ సందర్భంగా టీషర్ట్‌లు అందజేసిన వారిని క్రీడాకారులు అభినందించారు.

రాములోరి కల్యాణ తలంబ్రాలను బుక్ చేసుకోవాలి

కులకచర్ల, మార్చి 30: భద్రాచలం రాములోరి తలంబ్రాలు కావాల్సిన వారు బుక్ చేసుకోవాలని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌లో సీతారాముల తలంబ్రాల బుక్‌కింగ్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆర్టీసీ కండక్టర్ చంద్రయ్య ఆధ్వర్యంలో భద్రాచలం సీతారాముల కల్యాణానికి సంబంధించిన తలంబ్రాలు కావాల్సిన వారు సమాచారం ఇస్తే తలంబ్రాలను అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగానికి డబ్బెందుకు?..

- పార్ట్‌టైమ్ ఉద్యోగాల్లో టాస్క్‌ల పేరుతో బురిడీ
- ఈజీగా బుట్టలో పడుతున్న బాధితులు
- లక్షల్లో మోసాలు చేస్తున్న సైబర్‌ఛీటర్స్
- డబ్బు ప్రస్తావన వచ్చిందంటే మోసమని గుర్తించాలి
- రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసుల సూచన



సిటీబ్యూరో, మార్చి 30(నమస్తే తెలంగాణ): డబ్బు పెట్టకుండా వచ్చేది ఉద్యోగం... పనిచేసినందుకు ఆయా సంస్థల యజమాన్యాలు నెల, వారం, రోజు వారీగా జీతాలు, వేతనాలు ఇస్తుంటారు. ఉద్యోగం చేసేందుకు వెళ్లిన వారు ఎక్కడ కూడా డబ్బులు పెట్టుబడి పెట్టనవసరం లేదు. ఈ చిన్న లాజిక్‌ను మర్చిపోతూ చాలా మంది పార్ట్‌టైమ్ ఉద్యోగాల నగానే గుడ్డిగా నమ్మేసి సైబర్‌నేరగాళ్ల చేతిలో చిక్కి లక్ష రూపాయలు పోగొట్టుకుంటున్నారు. పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో వచ్చే మెసేజ్‌లను చూసి అది నిజమని నమ్మి చాలా మంది ఆయా మెసేజ్‌లకు స్పందిస్తున్నారు. పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్ ఇచ్చేవాళ్లు మొదట చెప్పే విషయాలు అన్ని నమ్మదగినవిగానే ఉంటాయి. మొదట ఎలాంటి పెట్టుబడి లేకుండానే రూ.500 నుంచి వెయ్యి రూపాయల వరకు మీరు చేసిన పనికి జీతం వచ్చిందంటూ నమ్మిస్తారు. ఇంత వరకు బాగానే ఉంటుంది. ఆ తరువాత మీరు ఎక్కువగా టాస్క్‌లు పూర్తి చేస్తే ఎక్కువగా సంపాదించవచ్చంటూ చెప్పడంతో ఈజీగా బాధితులు బోల్తాపడుతున్నారు. టాస్క్‌లు పూర్తి చేయాలంటే డబ్బు మేమెందుకు చెల్లించాలి? అంటూ అక్కడే అనుమానం వ్యక్తం చేస్తూ లోతుగా ఆరా తీస్తే మోసం బారినపడకుండా జాగ్రత్త పడే అవకాశాలుంటాయి. కానీ సైబర్‌నేరగాళ్లు పేరున్న హోటల్స్, సంస్థలకు సంబంధించిన రివ్యూలు, క్లిక్‌లు, సబ్‌స్క్రిప్షన్స్ చేయాలంటూ సూచించడంతోపాటు పేరున్న కంపెనీ పేరునే వాడుతుంటారు. దీంతో బాధితులు ఈజీగా వారి మాటలు నమ్మేస్తున్నారు. అయితే టాస్క్‌లు పూర్తి చేసేందుకు మీరు మా సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బు చెల్లించాలంటూ చెప్పినప్పుడే అనుమానాలు రావాలి. ఉద్యోగమన్నారు, ఇప్పుడు ఇన్వెస్ట్‌మెంట్, టాస్క్‌లు అంటున్నారంటూ అనుమానాలు వ్యక్తం చేయాల్సిన బాధితులు నేరగాళ్లు చెప్పే విషయాలను విని ఈజీగా నమ్మి మోసపోతున్నారు. డబ్బులు ఈజీగా రావని, ఉద్యోగాల విషయంలో డబ్బు ప్రస్తావన వచ్చిందంటే అది మోసమని గుర్తించాలంటూ రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసుల సూచిస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962